
బంగారుధ్వజ స్తంభానికి చేపట్టిన ప్రత్యేక అలంకరణ

# గణనాధునికి వైభవంగా చందనాలంకార సేవ

కాణిపాకం, జనవరి 16 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారికి సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం ముక్కనుమ రోజున చందనాలంకార సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో ముక్కనుమ రోజున స్వామివారికి చందనాలంకారసేవను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు గురువారం స్వామివారికి ఈ కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకంకు చెందిన సల్లా శివశంకరన్ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉభయదారులు పగలు వరుస ఉభయం తీసుకురాగా ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని చందనం, దూదితో శోభాయమానంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా సిద్ధి, బుద్ధి సమేతుడైన గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.


# తిరుపతి - చిత్తూరు


తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



### ఫ్లెమింగో ఫెస్టివల్-2025కు

# ప్రత్యేక ఏర్పాట్లు

**18,19,20 మూడు రోజుల పాటు ఐదు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు,డ్రోన్లతో నిత్యం పర్యవేక్షణ**

**జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్**




తిరుపతి కలెక్టరేట్,జనవరి 16 ప్రభాతవార్త ః
తిరుపతి జిల్లా సూళ్ళూరుపేట నియోజక వర్గ పరిధిలోని నేలపట్టు,పులికాట్ సరస్సు అందాలను ఓ సారి ప్రతి ఒక్కరు చూచి ఆనందిద్దాం రండి అని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ విజ్ఞప్తి చేశారు.ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు,డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఫ్లెమింగో ఫెస్టివల్-2025ను ప్రతిష్టాత్మంగా తీసుకున్నారు. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఫ్లెమింగ్ ఫెస్టివల్ మొత్తం మీద సీఎం, డెప్యూటీ సీఎంలు,టూరిజం మంత్రి, ఇతర శాఖ మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారని, ప్రపంచ పర్యాటకులు, పక్షుల ప్రేమికులు, యువత, విద్యార్థిని విద్యార్థులు, మహిళలు దాదాపు 5లక్షల మంది వచ్చే అవకాశం ఉందని అంచనా వేయడం జరిగిందన్నారు. వారి అవసరమైన అన్ని రకాల సదుపాయాలను ఐదు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటపట్టుకు,పులికాట్ సరస్సుకు వచ్చే గ్రేపెలికాన్, కార్మోనెట్ బిల్ (నీటికాకులు), స్పూన్‌బిల్ స్టాక్, ఓపెన్ బిల్ పక్షులతో పాటు 200 రకాల పక్షులను చూసేందుకు నేలపట్టు, పులికాట్ సర్సుల వద్ద, అటకాని తిప్ప దగ్గర పులికాట్‌కు రోడ్డుకు ఇరువైపుల, బీవీ పాళ్ళెం వద్ద పులికాట్ సరస్సులోకి 35 బోటింగ్స్ సదుపాయం, లైఫ్ జాకెట్, లైప్ బాయ్ గజ ఈతగాళ్ళు, స్థానికంగా ఉన్న 50 మందిని గైడులు, ఇక సూళ్ళూరుపేట అన్ని పాఠశాలల, కళాశాలల క్రీడా మైదానాల్లో ఈ నెల 18,19,20వ తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మూడు రోజుల పాటు కల్చరల్, క్రీడలు,లోకల్ సాంస్కృతిక తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. జిల్లా యంత్రాంగం, పోలీస్, ఫారెస్టు, టూరిజం శాఖ, శ్రీసిటీ, ఐఐటీ,ఐఐఎస్ఈఆర్, కొన్ని యూనివర్శిటీలు ఇతర అన్ని శాఖల సమన్వయంతో అంతా సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిత్యం పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు.ఎక్కడబడితే అక్కడ చెత్తా చెదారం,ఫ్లాస్టిక్ వస్తువులు వేయరాదని హితవు పలికారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌కు వచ్చే ప్రతి ఒక్కరికి టూరిజం,ఆర్టీసీ, స్కూల్ బస్సులను తిరుపతి నుంచి ప్రత్యేకంగా నడుస్తాయని తెలియజేశారు.అనంతరం ఫ్లెమింగో ఫ్లెస్టివల్‌కు సంబంధించి లోగోతో కూడిన డబ్లూ.డబ్ల్యూ.డబ్లూ.ఎఫ్ఎల్ఏఎంఐఎన్‌జీవోఎఫ్ఈఎస్‌టి.ఓఆర్‌జి.కామ్ వెబ్‌సైట్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్,జిల్లా అటవీ కన్జర్వేటర్ అధికారి సెల్వం,ఆర్డీ టూరిజం రమణ ప్రసాద్,జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మళ్ళీ దర్శన టోకెన్ కష్టాలు!

**చివరి రెండురోజుల వైకుంఠద్వార దర్శనాలకు భారీగా చేరిన భక్తులు**
**19న అర్ధరాత్రి మూతబడనున్న ద్వారాలు**





తిరుమల,జనవరి 16(ప్రభాతవార్తప్రతినిధి:
పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి చివరి ఒకరోజు (19వతేదీ ఆదివారం) టోకెన్లుకోసం భారీగా భక్తులు తమిళనాడు, కర్నాటక, తెలుగురాష్ట్రాల నుండి తిరుపతికి చేరుకున్నారు. వైకుంఠ దర్శనాలకు చివరగా భక్తులనుండి అనూహ్యస్పందన కనిపించింది. ఓవైపు వారాంతం శని,ఆదివారాలు సెలవులు రావడం మరోవైపు వైకుంఠద్వారాలు చివరిరోజు దర్శనం కావడంతో భక్తులు పోటెత్తారు. ఇప్పటికే తిరుపతిలో శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవికాంప్లెక్స్ మూడుప్రాంతాల్లో ఆఫ్‌లైన్‌లో వైకుంఠద్వార దర్శనానికి సంబంధించి ఒకరోజు ముందు దర్శనటోకెన్లును భక్తులు అందుకునేలా చూస్తున్నారు. అయితే చివరగా 18,19వ తేదీల్లో రెండురోజులు వైకుంఠద్వార దర్శనాలకు ఆఫ్‌లైన్‌లో టోకెన్లకు భక్తులు అనూహ్యంగా పోటెత్తారు. టిటిడి సమాచారం మేరకు ఒకరోజు ముందు దర్శన టోకెన్లు జారీచేస్తారు. అయితే అనూహ్యంగా భక్తుల రద్దీ పెరగడంతో గురువారం ఉదయం నుండి 18వతేదీకి (9వరోజు వైకుంఠద్వార దర్శనాలు)సంబంధించి టోకెన్లును నిరంతరాయంగా ఏకధాటిగా జారీచేశారు. సాయంత్రం 3.30గంటలవరకు 43వేల టోకెన్లు పూర్తిగా భక్తులు అందుకోవడంతో , ఆ తరువాత నుండి 19వతేదీ చివరి రోజు వైకుంఠద్వార దర్శనాలకు టోకెన్లు జారీ చేశారు. తిరుపతిలోని మూడు ప్రాంతాల్లో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో క్యూలైన్లలో బారులుతీరారు. భక్తులు సాఫీగా ముందుకు కదిలేలా, ఎక్కడా తోపులాట జరగకుండా సెక్యూరిటీ సిబ్బందితో నియంత్రించారు. క్యూలైన్ల వద్ద అన్నప్రసా దాలు, తాగునీరు. వైద్యశిబిరాలు కొనసాగించారు. భక్తులు నిరంతరాయంగా శ్రీవారి సేవకులతో సేవలందించారు. గతవారం రోజులు 4.73లక్షలమంది వరకు భక్తులు వైకుంఠద్వార దర్శనాలు చేసుకున్నారు. కాగా ఆదివారం 19వతేదీ అర్ధరాత్రి 12గంటలకు వైకుంఠద్వారాలను మూసివేస్తారు.

### శ్రీకాళహస్తి క్రీడా వికాస కేంద్రానికి జీవం

# క్రీడాకారులకు వరం

**ప్రారంభించిన శాప్‌చైర్మెన్**



శ్రీకాళహస్తి,జనవరి 16 ప్రభాతవార్త
శ్రీకాళహస్తిలోని యువ క్రీడాకారులను ప్రోత్సహించుటకు శ్రీ విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గత తెలుగుదేశం ప్రభుత్వ హాయంలో నిర్మించిన క్రీడా వికాస కేంద్రాన్ని గురువారం శాప్ చైర్మెన్ ప్రారంభించారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శాసనసభ్యుడుగా ఉన్న 2014-2019లో ఇక్కడ కోట్లు వెచ్చించి నిర్మించారు. గత ఐదు సంవత్సరాలుగా పరిపాలించిన నాయకులు నిర్లక్ష్యం చేసారు. గత అక్టోబర్‌లో దీనిని పరిశీలించిన శాప్ చైర్మెన్ అనిమిని రవినాయుడు ప్రారంభించారు.ఈ సందర్భంగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, చైర్మెన్ రవినాయుడులు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారుల ప్రయోజనాలే ముఖ్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు.క్రీడాకారుల భవిష్యత్తుకు పెద్దపీట ఇచ్చిన మాట ప్రకారం శ్రీకాళహస్తి కేవికేను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌ను క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దుటకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు.శ్రీకాళహస్తిలో గత పాలనలో నిర్లక్ష్యానికి గురైన క్రీడా వికాశ కేంద్రాన్ని గత ఏడాది అక్టోబర్‌లో పరిశీలించామన్నారు.ఇక్కడ కోట్లు వెచ్చించిన భవనాలు ఆసాంఘీక కార్యక్రమాలకు నిలయంగా మారటంతో రూ.35లక్షలు వెచ్చించి బాగు చేసామన్నారు. ఇక్కడ బ్యాడ్మింటన్, యోగా హాల్, మల్టీపర్పస్ జిమ్, క్రీడాపరికరాలను ప్రారంభించారు. ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి చొరవతో శాప్ నుంచి నిధులను మంజూరు చేసామన్నారు. క్రీడాకారుల భవిష్యత్తుకు శాప్ చిత్తశుద్ధితో ఉందన్నారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అన్నారు. తాను ఎంఎల్ఏగా గెలిచిన తరువాత నియోజక వర్గంలోని క్రీడా కారుల సదుపాయాల్ని పరిశీలించిన తరువాత గత పాలకులు క్రీడా స్థలాలను కూడా తమ అనుచరులకు అప్పగించారన్నారు. ఇక్కడ స్టేడియంను చక్కదిద్దుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఇక్కడ క్రీడా వికాస కేంద్రం 50శాతానికి మించిపూర్తి అయ్యింది కాబట్టి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. శ్రీకాళహస్తి పట్ల శాప్ చైర్మెన్ రవినాయుడు ప్రత్యేకంగా నిధులు అందించారని సుధీర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించారు.ఈ కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు,మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు,కంఠా రమేష్,డిల్లి బాబు,తదితరులు పాల్గొన్నారు.

# గగనతలంలో గేమ్ ఛేంజర్ ఇస్రో

**ఉపగ్రహాల అనుసంధానం దిగ్విజయం**
**- అదేరోజు షార్‌లో మూడో ప్రయోగవేదికకు కేంద్రం ప్రకటన**
**- శ్రీహరికోటలో మరోసారి అంబరాన్నంటిన సంబరం**











శ్రీహరికోట (తడ), జనవరి 16 ప్రభాతవార్త
గగనతలంలో మరోసారి ఇస్రో గేమ్ ఛేంజర్ అయింది. ఒకేరోజు భారత జాతి మొత్తాన్ని ప్రపంచం తమ వైపు తిప్పుకునేలా చేసింది. గత నెల 30వ తేదీన శ్రీహరికోట నుంచి ప్రయోగించిన పిఎస్ఎల్వి-సి60 రాకెట్ రెండు ఉపగ్రహాలను రోదశిలోకి ప్రవేశపెట్టింది. వాటి అనుసంధాన ప్రక్రియ కొంత ఆలస్యమైనప్పటికీ గురువారం దిగ్విజయంగా ఆ ఘట్టాన్ని మన శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. మూడురోజుల ముందే ఇస్రో నూతన సారధిగా బాధ్యతలు చేపట్టిన నారాయణన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగింది. బుధవారం 3984.86 కోట్ల రూపాయలను శ్రీహరికోటలో మూడవ లాంచ్ ప్యాడ్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర క్యాబినేట్ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టుతో భవిష్యత్‌లో అతి పెద్ద ఉపగ్రహాలను మన రాకెట్ల ద్వారా ప్రయోగించ డానికి ఉపయోగం ఏర్పడుతుంది. ఇప్పటికే ఇక్కడ రెండు లాంచ్ ప్యాడ్లు ఉన్నాయి. భవిష్యత్ అవసరాల కోసం మూడవది ఏర్పాటు చేస్తున్నారు. సూళ్లూరుపేట, శ్రీహరికోటతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇప్పటి నెల్లూరు, తిరుపతి జిల్లాలకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని, భారీ ప్రాజెక్టులు వస్తాయని నమ్ముతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ఇది ప్రయోజనం చేకూర్చుతుందని పలువురు అంటున్నారు.

### పులికాట్ సరస్సులో

# ఫ్లెమింగోల సందడి

**పక్షుల పండుగ పురుడు పోసుకుంది తడ పడవల రేవులోనే**



*తడ, జనవరి 16 ప్రభాతవార్త*
*పులికాట్ సరస్సులో వలస సముద్రపు రామచిలుకలను చూసి అప్పటి జిల్లా కలెక్టర్ కె.ప్రవీణ్ కుమార్ ఫ్లెమింగో ఫెస్టివల్‌కు శ్రీకారం చుట్టారు. 2000 సంవత్సరం చివరలో కలెక్టర్, అప్పటి గూడూరు డివిజన్ అధికారులు సూళ్లూరు పేట, తడ తెలుగుదేశం పార్టీ నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, కొందరు అధికారులు, ఒకరిద్దరు పాత్రికేయులతో కలిసి పులికాట్ సరస్సులో విహరించారు. ఆ సమయాన ఒక పక్షి సమూహం కలెక్టర్ బృందం పైనుంచి వెళ్లింది. అనంతరం ఆ పక్షుల్లో రెండు.. పడవల మధ్యన తిరుగుతూ పెద్దగా కనిపించాయి. ఈ దృశ్యాన్ని తిలకించిన కలెక్టర్ భవిష్యత్‌లో పులికాట్ సరస్సు తీరప్రాంతం పర్యాటక ప్రాంతంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం 2001లో ఈ పండగ ప్రారంభమయింది. అప్పట్లో కలెక్టర్‌తో పాటు పర్యటనకు వెళ్లిన కొందరు ప్రస్తుతం మన మధ్య లేరు. మరికొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. అయితే పక్షులు మాత్రం వస్తూనే ఉన్నాయి. మళ్లీ పండగ మొదలయింది. సుదూర దేశాల నుంచి వచ్చే ఫ్లెమింగోలు (సముద్రపు రామచిలుకలు), పెలికాన్లు (గూడ బాతులు), పెయిండెట్ స్టార్క్ (ఎర్రకాళ్ల కొంగలు) ఘనంగా స్వాగతం పలుకుతున్నాయి.*

# వైభవంగా సంక్రాంతి 'కొండచుట్టు'

**శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వెంట ద్రౌపది భీమార్జునులు, పోటెత్తిన భక్తజనం**



చంద్రగిరి, జనవరి 16 ప్రభాతవార్త:
సత్యప్రమాణాలకు నెలవైకొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి సంక్రాంతి కొండచుట్టు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. చంద్రగిరి గ్రామదేవతగా భక్తుల కొంగుబంగారమై వెలుగొందుతున్న శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో సంక్రాంతి మహోత్సవాలను ఆలయ ఈఓ మమత ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం అమ్మవారికి వేకువజామున ఆలయ అర్చకులు సూరి స్వామి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి అశ్వవాహనంపై అధిష్టింపజేశారు. తదుపరి ఆలయం నుండి మేళతాళాలు మంగళ వాయిద్యాలు, బ్యాండు బాజాలు, కేరళ బృంద వాయిద్యాలతో ధర్మరాజుల ఆలయం వద్దకు చేరుకున్నారు. కొండచుట్టు మహోత్సవాలలో అమ్మవారి ముందు ధర్మరాజుల వారు, భీమసేనుడు, అర్జునుడు, ద్రౌపధి సమేతంగా సాగుతుండగా వారిని అనుసరిస్తూ అమ్మవారు భక్తరక్షణకు బయలుదేరారు. సాయంత్రం 5 గంటలకు బయలుదేరి అమ్మవారు చంద్రగిరి పాతపేట, వెంకటంపేట, అగరాల, ఐతేపల్లి, పులిత్తివారిపల్లి, కొటాల, నాగయ్యగారిపల్లి, రెడ్డివారిపల్లి మీదుగా తిరిగి చంద్రగిరికి శుక్రవారం ఉదయం చంద్రగిరికి చేరుకుంటారు. ఈ నేపధ్యంలో ఆయా గ్రామాలలో ప్రజలు తమను అనుగ్రహించేందుకు విచ్చేస్తున్న అమ్మవారి రాకకు గ్రామస్థులు రాత్రి వేళ పూర్తి స్థాయిలో నిరీక్షించడం జరుగుతుంది. ఈ క్రమంలో గ్రామస్థులకు, వాహన మోతదారులకు అన్నదానాలు, తేనీరు వంటివి ఏర్పాట్లు చేస్తారు. చంద్రగిరిలోనే కాకుండా ఈ గ్రామీణ ప్రాంతాల ప్రజలు కొండచుట్టును స్థానిక పండుగగా భావించి అత్యంత పవిత్రంగా జరుపుకుంటారు. ఈ కొండచుట్టు ఉత్సవాలకు వివిధ ప్రాంతాలలో స్థిరపడిన, ఉద్యోగాలకు వెళ్ళిన వారంతా తమ సొంతూరుకు చేరుకుని ఇంటిల్లపాధి ఉత్సవాలలో పాల్గొని అమ్మవారికి కర్పూర నీరాజనాలర్పించడం సంప్రదాయంగా వస్తున్నది. అమ్మవారి వాహనసేవలో పాల్గొన్న భక్తులను వీక్షిస్తే నేల ఈనిందా అన్నచందంగా పోటెత్తిన భక్తజనానికి అవసరమైన సేవలందించడంలో ఆలయ ఈఓ మమత చర్యలు చేపట్టారు.

**-కొండచుట్టు మహోత్సవంలో ఎంఎల్ఏ పులివర్తినాని**

శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారి కొండ చుట్టు మహోత్సవంలో ఎంఎల్ఏ పులివర్తి నాని హాజరై వాహనసేవలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఇందులో భాగంగా ధర్మరాజుల స్వామి వారి ఆలయానికి చేరుకున్న ఆయన ముందుగా ధర్మరాజుల వారిని దర్శించుకున్నారు. తదుపరి అశ్వవాహనంపై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

**-డిఎస్పీ ప్రసాద్, సిఐ సుబ్బరామిరెడ్డి పటిష్ట భద్రతా ఏర్పాట్లు**

చంద్రగిరి డిఎస్పీ ప్రసాద్, సిఐ సుబ్బరామిరెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐలు సుమన్, రామకృష్ణ తమ సిబ్బంది కొండ చుట్టు ఉత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

# బ్రాహ్మణపల్లె, కురివికుప్పంలో జల్లికట్టు సంబరాలు



వెదురుకుప్పం, జవనరి 16 ప్రభాతవార్త :
స మండలంలోని బ్రాహ్మణపల్లె, కురివికుప్పం గ్రామాల్లో కనుమ పండుగాలో భాగంగా గిత్తల పందెలు నిర్వహించారు. సంబరాలలో కొడేగిత్తలు రంకేలు వేయడంతో యువకులు పౌరుషంతో బరిలోకి దిగడంతో జలికట్టు సంబరాలు అంబరాన్ని తాకాయి. రైతులు గిత్తలకు కొమ్ములు చెక్కి రంగులు వేసి చెక్క పట్టీలు కట్టి అందంగా అలంకరించారు. ఇష్ట దైవం, రాజకీయ నాయకులు, సినీ నటుల ఫోటోలతో కొమ్ము లకు చెక్క పటీలు,టవలు, నగదు కట్టి యువత పై బరిలోకి దించారు. మిద్దెలు, వీధులు జన సంద్రంగా మారిపోయాయి. అలంకరించి గిత్తలను దప్పుల దరువులు మధ్య అల్లె వద్ద వదలడంతో యువకులు రెట్టించిన ఉత్సహంతో బరిలోకి దిగి చెక్క పట్టీల కోసం గిత్తలతో కుస్తీకి దిగడంతో ఈలలు, కేరితల నడుమ నువ్వ … నేన అంటూ పోటా పోటీగా పోరు జరిగింది. కొన్ని గిత్తలు దొరికిపోవడంతో యువకులు చెక్క పట్టీలను చేజికించుకుని విజయదరహాసంతో కేరితలు కొట్టారు. మరీ కొన్ని గిత్తలు జనంను చీల్చుకుంటూ యువకులను నిరాశ పర్చుతూ పరుగులు పెట్టాయి …. పోటా పోటీగా సాగిన గిత్తల పోరులో కొన్ని సార్లు గిత్తలదే పై చేయికాగా … కొన్ని సార్లు యువకులదే పైచేయిగా మారింది. బ్రాహ్మణపల్లె,కురివికుప్పంలో జరిగిన గిత్తల పోటీలు రసవత్తంగా సాగాయి. చెదురు మదురు సంఘటలు మినహా అద్యంతం పోటీలు రసవత్తంగా జరిగాయి.

# హెల్మెట్ ధారణపై విస్తృతంగా అవగాహన

**– నేటి నుండి 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు**
**– పోస్టర్లు, బ్యానర్లను ఆవిష్కరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్**



**చిత్తూరు, జనవరి 16 ప్రభాతవార్త:** ద్విచక్రవాహనదారులకు హెల్మెట్‌ధారణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ బాబు, ఉప రవాణా కమీషనర్ నిరంజన్‌రెడ్డిలను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం నుండి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జరుగనున్న 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల నిర్వహణకు సంబంధించిన పోస్టర్లు, గోడపత్రికలు, బ్యానర్లను ఆవిష్కరించి ఈ కార్యక్రమ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక ద్విచక్రవాహనదారులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, హెల్మెట్ ధరించకపోవడంతో వారి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించడం ద్వారా అనుకోని సందర్భాల్లో ప్రమాదాలు జరిగినా వారు ప్రాణాలు కాపాడుకోగలరన్నారు. హెల్మెట్‌ధారణపై అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని, అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఈ విషయంగా అవగాహన పెంచాలన్నారు. కళాశాలల ప్రిన్సిపాళ్ళు సైతం విద్యార్థులు కచ్చితంగా హెల్మెట్ ధరించి వాహనం నడిపేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి అవగాహన కల్పించాలన్నారు. భద్రతా మాసోత్సవాల్లో భాగంగా హెల్మెట్‌ధారణపై మారథాన్, వాకథాన్, వ్యాసరచన పోటీ, వక్తృత్వ పోటీలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలను భాగస్వాములు చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌బాబు, ఉప రవాణా కమీషనర్ నిరంజన్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ప్రభావతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైసిపి జిల్లా అధికార ప్రతినిధికి సన్మానాల పరంపర



**పుంగనూరు, జనవరి 16, ప్రభాతవార్త** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన రాజశేఖర్ రెడ్డికి అభినందనల పరంపర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా సేవలందిస్తున్న రాజశేఖర్ రెడ్డిపార్టీ మండలంలోని పిచ్చి గుండ్లపల్లి గ్రామానికి చెందిన బలమైన నాయకుడు పార్టీతో పాటు పెద్దిరెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడు విధేయుడైన రాజశేఖర్ రెడ్డి పుంగనూరు పట్టణ మండల మరియు నియోజకవర్గ పరిధిలో పలు మండలాలలో తనదైన శైలిలో సేవలందిస్తున్నారు. పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఆశీస్సులతో ఆయనను పార్టీ అధికార ప్రతినిధిగా నియమించారు. తనపై నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టిన ఎమ్మెల్యే ఎంపీల పట్ల విధేయుడై ఉంటానని, జిల్లాలో పార్టీ బలుపేతం కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.

## కుటుంబాలు ఉన్నాయని అనుక్షణం గుర్తుంచుకోవాలి

**ఎంవిఐ సుప్రియ**



**పుంగనూరు, జనవరి 16, ప్రభాతవార్త** వాహనాలు నడిపేవారు అనుక్షణం తమ కుటుంబాలను, ఎదుటివారి జీవితాలను దృష్టిలో ఉంచుకుని సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సుప్రియ సూచించారు. గురువారం ఏ.పీ.ఎస్. ఆర్టీసీ పుంగనూరు డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ డ్రైవర్లు డ్రైవింగ్ చేయనప్పుడు పూర్తి ఏకాగ్రతతో బస్సును నడపాలని, సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా డ్రైవర్లు ఉండాలని సూచించారు. కండక్టర్లు మరియు మెకానిక్ సిబ్బంది కూడా అప్రమత్తతో ఉండి తమ విధులను నిర్వహిస్తే రోడ్డు ప్రమాదాలు వివరించేందుకు ఆస్కారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజ సుధాకరయ్య, కె.సంధ్య, ట్రాఫిక్ సూపర్వైజర్ టి. మురళి, అసిస్టెంట్ మేనేజర్ (మెటీరియల్), టి.సుధాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానిక్) డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

## నేటి నుండి కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ అభ్యర్థులకు దేహధారుఢ్య పరీక్షలు

**చిత్తూరు, జనవరి 16 ప్రభాతవార్త:** కానిస్టేబుళ్ళ ఎంపిక ప్రక్రియకు సంబంధించి చిత్తూరు పోలీసు శిక్షణా మైదానంలో శుక్ర, శనివారాల్లో అభ్యర్థులకు దేహదారుఢ్య, సామర్థ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదశి కారణంగా ఈ నెల 8, 9 తేదీల్లో జరుగాల్సిన కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ దేహదారుఢ్య, సామర్థ్య పరీక్షలను ఎపిఎస్‌ఎల్‌పిఆర్‌బి ఈ నెల 17, 18వ తేదీల్లో నిర్వహించడానికి వాయిదా వేసిందన్నారు. ఈ మేరకు చిత్తూరు ఉమ్మడి జిల్లా(చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య) పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో జరుగనున్నాయన్నారు. ఈ ఎంపికలకు సంబంధించి ఎవరైనా అప్పీలు చేయదలచుకుంటే అలాంటి అభ్యర్థులు ఈ నెల 20వ తేదీన జిల్లా పోలీసు శిక్షణా మైదానంలో హాజరు కావాలన్నారు. కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకం, ప్రతిభ పాటవాల ఆధారంగానే జరుగుతుందని, అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు దళారులు, మధ్యవర్తులను నమ్మకుండా, మోసపోకుండా వుండాలన్నారు. ఎవరైనా కానిస్టేబుళ్ళ ఎంపిక ప్రక్రియకు సహకారం అందిస్తామని నమ్మిస్తే అలాంటి వారిపై 112 లేదా పోలీసు వాట్సాప్ నెం.9440900005కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

## ఆర్యవైశ్యుల వనభోజనం



**పూతలపట్టు, జనవరి 16, ప్రభాతవార్త** మండలంలోని ఆర్యవైశ్యులు కనుమ పండుగ మరసటి రోజున వనభోజన (గోటు) కార్యక్రమం ఏర్పాటు చేసుకుంటారు. ఈ కార్యక్రమం ఉదయం 6 గంటలకు ఆర్య వైశ్యులందరూ కలిసి వన భోజన కార్యక్రమానికి వెళ్తారు. ఉదయం కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. మహిళలందరూ కలిసి వంట కార్యక్రమాలు చేపడతారు. వంటలు పూర్తయిన మళ్లీ మధ్యాహ్నం పూజ చేస్తారు. పూజ తర్వాత అందరూ కలిసి సహపంక్తి భోజనం చేస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతారు. ఈ కార్యక్రమంలో గెలిచిన వారికి బహుమతులు ప్రధానం చేస్తారు. ఈ కార్యక్రమం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మల్లికార్జున శెట్టి, సంఘ సభ్యులు అందరూ కలిసి అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. సంఘ సభ్యులు మల్లికార్జున శెట్టి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా వనభోజన కార్యక్రమం జరుపుకుంటామని తెలిపారు.

## దక్షిణామూర్తికి విశేష పూజలు



**కల్లూరు, జనవరి 16, ప్రభాతవార్త** పులిచెర్ల మండలం జాండ్రపేట శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం దక్షిణామూర్తికి విశేష పూజలు చేశారు. ఆలయంలో ఉదయం దక్షిణామూర్తికి అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయ దారులు జ్ఞానేశ్వర్ కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు.

## జనసేన భారీ సభకు స్థల పరిశీలన

**సోమల, జనవరి 16, ప్రభాతవార్త**



సోమల మండలంలోని సూరయ్య గారిపల్లి వద్ద రెండో తేదీ జరిగే భారీ బహిరంగ సభకు గురువారం జనసేన నాయకులు స్థల పరిశీలన చేశారు. సూరయ్య గారి పల్లి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన 45 అడుగుల జనసేన స్థూపాన్ని నాయకులు ఫిబ్రవరి రెండున ఆవిష్కరించనున్నారు. జిల్లా నాయకులతో పాటు రాష్ట్ర నాయకులు కూడా పాల్గొని ఈ సభకు భారీగా జన సమీకరణ చేసేందుకు నియోజకవర్గ నాయకులు సమాయత్తం అవుతున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ చిన్న రాయల్, శివ కుమార్ రెడ్డి, విరూపాక్షి, మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణం, డాక్టర్ హరినారాయణ, బండారు రఘు, విజయ్, రామకృష్ణ సూరయ్య గారి పల్లి పంచాయతీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నేడు కాణిపాకంలో సంకటహర గణపతివ్రతం

**కాణిపాకం, జనవరి 16 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శుక్రవారం సంకటహర గణపతివ్రతం‌ను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ప్రతినెలా పౌర్ణమి అనంతరం వచ్చే చతుర్థి రోజున ఈవ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు జరిగే ఈవ్రతంలో భక్తులు 350 రూపాయలు టిక్కెట్ చెల్లించి గోత్రనామాలతో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కోరారు. అలాగే రాత్రి7గంటల నుండి 8 గంటల వరకు స్వామివారికి స్వర్ణరథోత్సవం జరుగుతుందని ఆయన తెలిపారు.

**20న కాణిపాకం ఆలయ హుండీల లెక్కింపు**

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 20న హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు జరిగే హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తప్పక పాల్గొనాలని తెలిపారు

## నారా భువనేశ్వరిని కలసిన ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, జనవరి 16 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. నారావారిపల్లిలో నారా భువనమ్మను కలసిన అనంతరం ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కుప్పంలో తాజా పరిస్థితులను నారా భువనమ్మ అడిగి తెలుసుకున్నారు.

## తెలుగుయువత అధ్వర్యంలో రంగవల్లుల పోటీలు

**కుప్పం, జనవరి 16 ప్రభాతవార్త**



సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని అడవిములకలపల్లిలో తెలుగుయువత అధ్వర్యంలో రంగవల్లుల పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని అందమైన రంగవల్లులను వేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మునిరత్నం స్థానిక యువత పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి పదివేల సాయం

**రామకుప్పం, జనవరి 16 ప్రభాతవార్త** మండలంలోని ఆనిగానూరుకు చెందిన తెదేపా కార్యకర్త వెంకటాచారి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో సమాచారం తెలుసుకున్న తెదేపా నేతలు గ్రామానికి చేరుకుని వెంకటాచారి మృతదేహానికి నివాళులు అర్పించారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో బాధిత కుటుంబానికి పదివేల రూపాయలు అంత్యక్రియల నిమిత్తం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత మునస్వామి, మాజీ సర్పంచ్‌లు రామూర్తి, జయశంకర్, నేతలు కృష్ణారెడ్డి, మహేంద్రనాయుడు, మనీష్,షణ్ముగం, వెంకటరామయ్య గౌడు, బీరప్ప, మంజు పాల్గొన్నారు.

## అధికారుల ద్వారా గ్రామస్తులు..రైతులకు దారి సౌకర్యం

**వి.కోట, జనవరి 16 ప్రభాతవార్త**



మండలంలోని తోటకనమ పంచాయతీ కస్తూరి నగరం గ్రామస్తులు, రైతులకు అధికారులు దారి సౌకర్యం కల్పించారు. దండికుప్పం గ్రామం వద్ద కస్తూరి నగరం రైతుల భూములు ఉన్నాయి. అయితే దండికుప్పం వద్ద ఆ గ్రామానికి చెందిన వారు తమ భూములను ఇతరులకు విక్రయించారు. దీంతో భూములు కొన్న వారు ప్రహరీ నిర్మించడంతో కస్తూరి నగరం రైతులకు రాకపోకలకు కష్టంగా మారింది. దీంతో మూడేళ్లుగా కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తహశీల్దార్ పార్వతి గురువారం పోలీసు, రెవెన్యూ యంత్రాంగాన్ని వెంటపెట్టుకుని భూముల వద్దకు చేరుకున్నారు. భూములు కొనుగోలు చేసి రైతులతో చర్చించి జెసిబి యంత్రాలతో 15 అడుగుల వెడల్పుతో దారి సౌకర్యం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సిఐ సోమశేఖర్‌రెడ్డి, ఆర్ఐ మోహన్‌రెడ్డి, ఎస్సై బాబు, విఆర్వో మునిరత్నం, సర్వేయర్లు భాస్కర్, బాలాజీ, నేతలు రామూర్తి, రైతులు ప్రతాప్, దయ, సుబ్బన్న పాల్గొన్నారు.

## గర్భిణీలకు అల్ట్రా సౌండ్ స్కానింగ్‌తో మెరుగైన సేవలు

**– డాక్టర్ మోహన్‌కృష్ణ**



**పాలసముద్రం, జనవరి 16 ప్రభాతవార్త:** పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్‌ను పిహెచ్‌సి కేంద్రంలో ప్రారంభించినట్లు డాక్టర్ మోహన్‌కృష్ణ పేర్కొన్నారు. ఇది వరకు పిహెచ్‌సిలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ లేకపోవడంతో గర్భిణీలు ఇబ్బందులు పడేవారని, గర్భిణీలు 7 నెలల నుండి తల్లి, బిడ్డల ఆరోగ్య స్థితులతో పాటు శిశువు ఎదుగుదల, పొడవు, అవయవాల పరిస్థితులను స్కానింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ స్కానింగ్‌లో హైరిస్క్ ఎదైనా వుంటే గుర్తించా ఆ గర్భిణీ స్త్రీను చికిత్స నిమిత్తం పెద్ద ఆసుపత్రికి తరలించి చికిత్స చేయడానికి అవకాశం కల్గుతుందన్నారు.

# పక్కాగా జాతీయ కుష్ఠు నిర్మూలన సర్వే

**– పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్**



**చిత్తూరు, జనవరి 16 ప్రభాతవార్త:** ఈ నెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ కుష్టు నిర్మూలనా కార్యక్రమ ఇంటింటి సర్వే గోడపత్రిక, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలించడంలో భాగంగా ప్రారంభ దశలోనే దీనిని గుర్తించి సరైన వైద్య చికిత్స అందించడం ద్వారా కుష్టు వ్యాధి వ్యాప్తి చెందకుండా వుంటుందని, అందుకు అనుగుణంగా వైద్యశాఖ విధులు నిర్వర్తించాలన్నారు. ఈ వ్యాధికి సంబంధించిన లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులను తనిఖీ చేసి కుష్టు వ్యాధి లక్షణాలు వుంటే గుర్తించి చికిత్స అందించాలన్నారు. ఈ వ్యాధిని ముందుగా గుర్తించడం ద్వారా అంగవైకల్యంను కట్టడి చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## గురుదక్షిణామూర్తికి విశేషాభిషేకాలు



**శ్రీకాళహస్తి,జనవరి 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన క్షేత్ర పాలకుడు గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు, హోమాలు, అభిషేకాలు ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో భక్తి శ్రద్దలతో నిర్వహించారు. దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో కాలుమోపిన వారికి తెలియని అనుభూతి కల్గిస్తుంది. ఆలయంలో ప్రవేశించిన వెంటనే బాహ్య ప్రపంచాన్ని మరచి పోతారు. శివయ్య సేవలో తరిస్తారు. అంతటి మహిమాన్విత దివ్యక్షేత్రంలో వెలసిన గురువు దక్షిణామూర్తికి గురువారం పండగలా పూజలు నిర్వహించటం ఈ దివ్యక్షేత్రంలో ఆచారంగా వస్తుంది.

**ఆకట్టుకున్న అలంకారాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కంచుగడప నుంచి ప్రవేశిస్తూనే మొట్టమొదట దర్శనమిచ్చేది. గురుదక్షిణామూర్తి. ఇక్కడ దక్షిణామూర్తి క్షేత్రపాలకుడుగా విరాలజిల్లుతున్నారు. ఈ ఆలయం వద్ద ప్రతి గురువారం విశేష పూజలు అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. ఇక్కడ గురుసంక్రమణ సందర్భంగా నిర్వహించే పూజలకు ఎంతో ఆదరణ ఉంది. తమిళనాడునుంచి భక్తులు విశేష సంఖ్యలో వస్తారు. ఉభయదారులుగా కూడా ఉన్నారు. ఇక్కడి ఆలయాన్ని భక్తుల భాగస్వామ్యంతో బంగారుతాపటం జరిపించారు. అంతేకాక గురువారం షోడషాభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద భక్తులు వరుస కట్టారు. ఉదయం ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో గురుదక్షిణామూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన గావించారు. తరువాత స్వామికి హోమాలు నిర్వహించారు. అనంతరం పాలు, పెరుగు, పంచామృతం, చందనం, పసుపు, తేనె, నారికేళ్ళ జలంతో అభిషేకాలు జరిపారు. తరువాత సుగంధ పరిమళ పుష్పాలతో, స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదపండితుల వేద మంత్రాల మధ్య స్వామి వారికి 108 దీపాల పర్వత హారతి, చక్రహారతి, కుంభ హారతి మహామంగళ హారతులిచ్చారు. ఈ కార్యక్రమాల్లో టెంపుల్ ఇన్స్పెక్టర్ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, హరియాదవ్, నాగభూషణం, పర్యవేక్షించగా స్థానిక భక్తులు విశేష సంఖ్య హాజరైనారు. పూజలు, అభిషేకాలను ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

## పట్టణంలో పడకేసిన పారిశుధ్యం

**–కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు**

**శ్రీకాళహస్తి, జనవరి 16 ప్రభాతవార్త**



పురపాలక సంఘ అధికారులు పన్నుల వసూళ్ళలో చూపిస్తున్న శ్రద్ధ పారిశుధ్యంలో చూపడం లేదు. ఇందుకు నిదర్శనం గత వారం రోజులుగా పట్టణంలోని 21,22,23 వార్డులో మురికి కాలువలు చెత్తతో నిండిపోయి కాలువలోని మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయం . దీనిపై వార్డు ప్రజలు పురపాలక సంఘగ అధికారులకు విన్నవించినా ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో మేమేం చేయలేం అంటూ సమాధానం ఇచ్చారని వాపోయారు. గురువారం ఉదయం పురపాలక సంఘ కమిషనర్ పోన్‌చేసి చెప్పినా పారిశుధ్య కార్మికులు స్పందించలేదంటేవారు ఏమాత్రం పనిచేస్తున్నారోఅర్థమవుతోంది. ఇంటిపన్ను, కుళాయిపన్ను కట్టండంటూ ఇండ్ల ముందు దండోరా వేస్తారని అయితే ప్రజలును ఇబ్బంది పెడుతున్న పారిశుధ్య సమస్యను పరిష్కరించమంటే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పట్టణంలో సీజన్ వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇకనైనా పైవార్డుల్లో పారిశుధ్యచర్యలు తీసుకోవాలని లేకుంటే మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని వార్డు ప్రజలు తెలిపారు.

## శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారికి టిటిడి పట్టు వస్త్రసాలు

**చంద్రగిరి, జనవరి 16 ప్రభాతవార్త:** చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మవారికి సంక్రాంతి పర్వదినాలలో నిర్వహించే కొండచుట్టు ఉత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పట్టువస్త్రాలను సమర్పించడం సంప్రదాయంగా వస్తున్నది. ఇందులో భాగంగా గురువారం తిరుమల శ్రీవారి ఆలయం నుండి అమ్మవారికి ఆలయ అధికార ప్రతినిధులు పట్టువస్త్రాలను తీసుకువచ్చారు. స్థానిక కోదండరామాలయం నుండి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బ్యాండుభాజాల నడుమ ఎంఎల్‌ఏ పులివర్తి నాని, ఎంఎల్‌ఏ సతీమణి పులివర్తి సుధారెడ్డి దంపతులు పట్టువస్త్రాలను అమ్మవారి ఆలయం వద్దకు మోసుకుని బయలుదేరారు. మార్గ మధ్యలో ద్రౌపది, ధర్మరాజుల స్వామి సమేత పాండవులను దర్శించుకుని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రదక్షిణ గావించి అర్చకులకు పట్టువస్త్రాలను అందజేశారు. ఈ నేపథ్యంలో ఎంఎల్‌ఏ రాకను పురస్కరించుకుని ఆలయ అర్చకులు సూరి స్వామి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈఓ మమత సాదరంగా ఆహ్వానించి అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, వీరంగారి రమేష్ రెడ్డి, పులికంటి మోహన్ రెడ్డి, శానంబట్ల తులసిరెడ్డి, ఏజి పల్లి బాల, రవితేజ యాదవ్, మండలం లోకేష్ రాయల్, ఉమాపతి రెడ్డి, మంగాపురం భాస్కర్ రాయల్, రాజేంద్రప్రసాద్ రెడ్డి (పెదబాబు), తదితరులు పాల్గొన్నారు.

## మోటారు సైకిళ్ళ దొంగతనం చేసిన ముద్దాయి అరెస్టు

**15 లక్షల విలువ చేసే 13 మోటారు సైకిళ్ళు స్వాధీనం**

**తిరుపతి కార్పొరేషన్, జనవరి 16, ప్రభాతవార్త**



మోటారు సైకిళ్ళ దొంగతనం కేసులో ముద్దాయిని అరెస్టు చేసుకుని 15 లక్షల విలువ చేసే 13 మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి వెస్ట్ ఇన్స్పెక్టర్ వి. మురళీ మోహన్ రావు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పి మణికంఠ ఛందోలు ఆదేశాల మేరకు తిరుపతి సబ్ డివిజనల్ పోలీసు అధికారి జె. వెంకట నారాయణ పర్యవేక్షణలో మోటారు సైకిళ్ళ దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అలిపిరి రోడ్డు, వివేకానంద సర్కిల్ బస్ స్టాపు వద్ద ముద్దాయిని తిరుపతి వెస్ట్ పోలీసు వారు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసారు. రాబడిన సమాచారంతో వాహనాలు తనిఖీ చేయగా పోలీసులను చూసి పారిపోతున్న పఠాన్ సాహిద్ భాషా అలియాస్ సాహిద్ (24)ను అరెస్టు చేయగా ముద్దాయితో పాటు కలిసి నేరము చేసిన పఠాన్ ఇమ్రాన్, మహేంద్రా నాయక్‌లలో, పఠాన్ ఇమ్రాన్ పరారీలో ఉండగా మహేంద్ర నాయక్ గత నెలలో రోడ్డు ప్రమాదములో చనిపోయాడని తెలిసింది. ముద్దాయిని అరెస్టు చేసి ముద్దాయి దొంగలించిన 13 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని అతనిని రిమాండు నిమిత్తం పంపించినందులకు వెస్ట్ ఇన్స్పెక్టర్ వి. మురళీ మోహన్ రావు, వెస్ట్ ఎస్ఐ ఎంవి అనిల్ కుమార్, ఏఎస్ఐలు సురేంద్ర, హెడ్ కానిస్టేబుల్స్ ఎన్. వెంకటేశ్వర రావు, రాము కానిస్టేబుల్స్ గోపినాథ్, రమేష్‌లను తిరుపతి డిఎస్పి జె. వెంకటనారాయణను ప్రత్యేకంగా అభినందించారు.

## బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**కల్లూరు, జనవరి 16, ప్రభాతవార్త** పులిచెర్ల మండలం కల్లూరు లో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు పులిచెర్ల మండలం కల్లూరులో బుధవారం రాత్రి పీలేరు డిపో ఆర్టీసీ బస్సు పీలేరు నుండి చిత్తూరుకి వెళుతున్న మార్గంలో కల్లూరు విఆర్ఎల్ లాడ్జి సమీపంలో బస్టాండ్ నుండి ఇంటికి వెళుతున్న షౌకత్ (60)ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాయపడిన అతడిని పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# మోటార్ వాహన చట్టంపై అవగాహన తప్పనిసరి : జిల్లా కలెక్టర్

**- రహదారి భద్రతా మాసోత్సవాల గోడపత్రిక, బ్యానర్లు, కరపత్రాల ఆవిష్కరణ**



తిరుపతి కలెక్టరేట్, జనవరి 16 ప్రభాతవార్త :

మోటార్ వాహన చట్టం 1998 ప్రకారం అమలు చేయవలసిన నిబంధనలకు,రహదారి భద్రత హెల్మెట్ ధారణ, రహదారి నియమ నిబంధనలకు, ట్రాఫిక్ సిగ్నల్స్ కు సంబంధించి తిరుపతి జిల్లా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ చాంబర్‌లో జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు రవాణా శాఖ వారిచే నిర్వహించనున్న 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు-2025 నిర్వహణకు సంబంధించి గోడపత్రికలు, బ్యానర్లు, కరపత్రాలను రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మోటార్ వాహనాల నిబంధనలకు సంబంధించి ద్విచక్రవాహనం నడుపుతున్నప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించడం, చిన్న మధ్య భారీ వాహనాల డ్రైవింగ్ చేయునపుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని, అధిక బరువు తీసుకెళ్ళటం, అతివేగంగా వెళ్ళడంపై తదితర అంశాలపై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహణ కార్యక్రమాలు నిర్వహించి వారిని చైతన్య వంతులుగా చేసి ప్రమాద రహిత డ్రైవింగ్ చేయడమే ప్రధాన లక్ష్యంగా డ్రైవర్లు ముందుకు వెళ్ళేలా చూడాల్సిన బాధ్యత రవాణా, పోలీస్‌శాఖలపై ఉందన్నారు. నేటి నుంచి ఫిబ్రవరి 15వ తేది వరకు నిర్వహించబోయే రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా జాగ్రత్తగా పర్యవేక్షించాలని జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ మోటార్ వాహన తనిఖీ అధికారులు సుబ్రమణ్యం,మోహన్‌కుమార్, ఆంజనేయ ప్రసాద్, వెంకటరమణ నాయక్, ఆంజనేయ వర్మ, పరిపాలన అధికారి శ్రీనివాసులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నారాలోకేష్‌ను కలసిన మండల అధ్యక్షుడు

తొట్టంబేడు, జనవరి 16 ప్రభాతవార్త



నారావారిపల్లెలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి తెలుగుదేశంపార్టీ జాతీయ కార్యదర్శి నారాలోకేష్‌ను తొట్టంబేడు మండల అధ్యక్షుడు గాలిమురళీనాయుడు నారావారి పల్లెలో మర్యాదపూర్వకంగా కలసి శుభా కాంక్షలు తెలియజేస్తూ మండల సమస్య లను లోకేష్ దృష్టికి తెచ్చారు. మండలా నికి నిధులు అవసరం ఎంతో ఉందని కావున తొట్టంబేడు మండలానికి నిధులు విడుదల చేయాలని కోరారు. మురళీనాయుడుతో పాటు పొయ్య మాజీ ఎంపిటిసి విజయకు మార్‌నాయుడు, తెలుగుయువత నాయకులు నానీ, అనంతరం లోకేష్‌లు స్పందిస్తూ విజయవాడ పార్టీ కార్యాలయానికి రావాల్సిందిగా ఆదేశించారు.

## ఎంఎల్‌ఏను సత్కరించిన ల్యాబ్‌టెక్నీషియన్లు

శ్రీకాళహస్తి, జనవరి 16 ప్రభాతవార్త



నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత దివంగత నేత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి కుమారుడు శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డిని శ్రీకాళహస్తి ల్యాబ్‌టెక్నీషియన్ అసోసియే షన్ ఆధ్వర్యంలో ఊరందూరు లోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువ, పూలమాల, పుష్పగుచ్చం అందించి సత్కరించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ పట్టణంలో సీజనల్ జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని ఇటీవల పత్రికల్లో కూడా ల్యాబ్‌టెక్నీషియన్లు నిరుపేదల వద్ద దోచుకుంటున్నారని వార్తలు కూడా ప్రచురితం అయ్యాయని వివరిస్తూ నిరుపేదలకు అవసరమైన పరీక్షలు మాత్రమే చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ ఆలీ, ఉపాధ్యక్షుడు హరీష్, సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలి

తొట్టంబేడు, జనవరి 16 ప్రభాతవార్త




రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని పట్టణ రెండో పోలీస్‌స్టేషన్ సిఐ వెంకటేశులు అన్నారు. రోడ్డు భద్రతా పక్షోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీకాళహస్తి ఆర్టీసి డిపోలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని, అలాగే ద్విచక్రవాహనాలు నడిపేవారు తమ రికార్డులతో పాటు తప్పక హెల్మెట్ ధరించాలని అప్పుడే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఆరులైన్ల రోడ్డులో అత్యధిక వేగంతో వెళ్తున్నారని ఇది ఎంతో ప్రమాదకరమన్నారు.వాహనాలను ఓవర్‌టేక్ చేసే సమయంలో జాగ్రత్తలు అవసరమం అన్నారు. అదేవిధంగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడుపరాదన్నారు. ఆర్టీసి బస్సు డ్రైవర్లు మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఎఫ్ చక్రవర్తి, అసిస్టెంట్ మేనేజర్ చిట్టెమ్మ, యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఏ, శాఫ్ ఛైర్మన్‌లకు సత్కారం

.తొట్టంబేడు, జనవరి 16 ప్రభాతవార్త



గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన శ్రీకాళహస్తి పట్టణంలోని క్రీడా వికాస కేంద్రాన్ని అన్ని హంగులతో పునర్నించిన క్రీడా వికాసకు లకు పౌరసన్మానం చేసినట్లు తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్‌రావు తెలిపారు. పట్టణంలో ఉన్న క్రీడా వికాస కేంద్రాన్ని ప్రజలు వినియోగించుకునేలా అవసరమైన మరమ్మత్తులకు నిధులు సమకూర్చి క్రీడాకారులు తమ తమ క్రీడాంశాలను సాధన చేయడానికి సాధారణ ప్రజలు వ్యాయామం చేసుకోవడానికి తగిన పరికరాలు కావాలని పట్టుబట్టి మరీ ఆచరణలోకి తీసుకువచ్చిన ఘనత ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డిదే అన్నారు.గత ప్రభుత్వంలో జగన్‌రెడ్డి తుగ్లక్ నిర్ణయాలకు దోపిడీకి గురై కుదేలైన రాష్ట్ర క్రీడా రంగం యొక్క పునర్నిర్మాణానికి సిఎం నారాచంద్రబాబునాయుడు మరియు మంత్రులు నారాలోకేష్ దిశానిర్దేశంలో శాఫ్ ఛైర్మన్ రవినాయుడు బృందం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉమేష్‌రావుతో పాటు, మిన్నల్‌రవి, కోటచంద్రశేఖర్, నెమళ్ళూరుబుజ్జి, పేటబాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

శ్రీకాళహస్తి, జనవరి 16 ప్రభాతవార్త



ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలతో పాటు వృద్ధుల సంక్షేమానికి కూడా కృషి చేయాలని ఏక్తా యాంటి కరప్షన్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ కోరారు. జాతీయ సహాయ కార్యదర్శి అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద సాధువులకి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది సాధువులు చలికాలంలో ఇబ్బందులు పడకుండా వంతెన మీద నిద్రిస్తుంటారని వారిని దుప్పట్లు అందించడం తమ అదృష్టమన్నారు. కార్యక్రమంలో యాసిన్, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌కలాం, సిపిఎం నాయకులు అన్వర్ మరియు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## కొండచుట్టు ఉత్సవంలోనడీఎస్పీ, టీడీపీ నాయకులు

పుత్తూరురూరల్, జనవరి 16 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలో కొండచుట్టు ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ కొండచుట్టు ఉత్సవానికి పుత్తూరు డీఎస్పీ, టీడీపీ నాయకులు హాజరై దేవతామూర్తుల ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో పుత్తూరు డీఎస్పీ, పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, టీడీపీ నాయకులు ఈశ్వర్ యాదవ్, లక్ష్మిపతి, వినోద్ యాదవ్, ఆనంగి రమేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్యసేవలో అతిథులు

శ్రీకాళహస్తి,జనవరి 16 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం భక్తులతో పాటు విఐపిల సందడి చోటు చేసుకుంది. రాష్ట్ర రిటైర్డ్ డిజిపి ఆర్‌పి ఠాగూర్ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు.వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి,పిఆర్ఓ రవి వేదపండితులతో స్వాగతం ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. కాగా ఆలయంలో గురువారం 20వేల మంది భక్తులు దర్శించుకోగా రాహుకేతుదోష నివారణ పూజల్ని 2వేల మంది చేయించుకున్నారు.

## శివయ్యసేవలో బీహార్ ప్రభుత్వ అధికారి

శ్రీకాళహస్తి,జనవరి 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం బీహార్‌కు చెందిన ఉన్నతాధికారి కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.వారికి ఏర్పాట్లును మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు,న్యాయవాది వడకలూరు మస్తానయ్య ఏర్పాట్లు చేసారు. బీహార్ స్టేట్ కేడర్ ఐఏయస్,అదనపు కార్యదర్శి ఒకప్పుడు పాట్నా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన కె.పరశురామయ్య కుటుంబసభ్యులతో రాగా పరిపాలనా భవనం వద్ద స్వాగతం చెప్పగా దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు విద్యాసాగర్‌రెడ్డి, పిఆర్ఓ రవిలు స్వాగతం పలికారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## సచివాలయాన్ని ఆకస్మికంగా ఎంఎల్‌ఏ: తనికీ

శ్రీకాళహస్తి,జనవరి 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని సచివాలయ సిబ్బంది పని తీరుపై స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు.గురువారం ఆయన పట్టణం లోని పలు ప్రభుత్వ సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేసారు.పట్టణ నడిబొడ్డులోని 13,14 వార్డుల్లోని సచివాలయాలను ఆకస్మికంగా తనికీ చేసారు. ఆయన పరిశీలనలో ఉద్యోగులు అందుబాటులో లేదు. అక్కడ సమాధానం చెప్పె దిక్కులేదు. దాంతో ఎంఎల్ఏ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసారు.ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వ్యవస్థలో పని చేసే ఉద్యోగులు ఇలా చేయటం తగదన్నారు.వ్యవస్థలో మార్పుకు ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ పాలన ఉండాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వ్యవస్థ లో పని చేయు ఉద్యోగులు ఇలా గైరు హాజరు కావటంను పర్యవేక్షణ అదికారులు సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు.ఆయనతో పాటు మాజీ వ్యవసాయమార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు,పట్టణ అధ్యక్షుడు విజయకుమార్‌లు ఉన్నారు.

## సీనియర్ కార్యకర్తను పోగొట్టుకున్నాం

శ్రీకాళహస్తి,జనవరి 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలానికి చెందిన సీనియర్ వైకాపా నేతను పార్టీ పోగొట్టుకుందని మాజీ శాసన సభ్యుడు బియ్యపు మధుసూ ధనరెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు.ఏర్పేడు మండలం మునిలిపేడుకు చెందిన వైకాపా మద్దతు దారుడు పునీత్ ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతదేహానికి మాజీ శాసనసభ్యుడు మధుసూదనరెడ్డి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని ఓదార్చారు. పార్టీ కోసం పాటు పడిన కార్యకర్తల కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో ఏర్పేడు మండల పార్టీ ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, బత్తిశెట్టి, నాగార్జున్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్, వెంకటేశ్‌యాదవ్, కమల్ యాదవ్, కుషల్ యాదవ్, మహేష్ తదితరులు ఉన్నారు.

## ప్రయాణీకులకు అసౌకర్యం కలిగించొద్దు

**-సకాలంలో బస్సులు నడపండి**

**-ఆర్టీసి బస్టాండులలో డిపిటిఓ నరసింహులు**

తిరుపతి(రవాణ), జనవరి 16 ప్రభాతవార్త:




వరుసగా నాలుగురోజులు సంక్రాంతి పండుగ సెలవులు ముగియడం, తిరుపతి నుండి ఇతర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణీకులు, శ్రీవారి భక్తులు,యాత్రికులతో తిరుపతి బస్టాండులు కిటకిటలాడాయి. గురువారం మధ్యాహ్నాం బస్టాండులలో ఆయా ప్రాంతాలకు బయలుదేరి వెళ్లే బస్సులను సకాలంలో నడపాలని, ప్రయాణీకులకు అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఆర్టీసి జిల్లా ప్రజా రవాణా అధికారి జి.నరసింహులు ఆదేశించారు. సెలవులు ముగియడంతో తిరుగుప్రయాణంలో బస్సుల కోసం ప్రయాణీకులు బస్టాండులలో వేచివుండటం, రద్దీకి అనుగుణంగా బస్సులు నడపడంపై గురువారం మధ్యాహ్నాం డిపిటిఓ నరసింహులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రయాణీకులసేవలు సకాలంలో అందాలని, బస్సులను సమయం ప్రకారం నడపాలని అక్కడి అధికారులను ఆదేశించారు. తిరుమల నుండి తిరుపతికి దిగిన భక్తులకు బస్సులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు.

# శ్రీకాళహస్తిని అభివృద్ధి బాటలో నడిపించేది ఎంఎల్‌ఏ ఒక్కరే

.తొట్టంబేడు, జనవరి 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించడం అభినందనీయం అని తొట్టంబేడు మండలం సాంబయ్యపాళెంకు చెందిన మహిళానేత మునిరాజరెడ్డి(చిట్టెమ్మ) కొనియాడారు. గురువారం శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డిని గురువారం ఊరందూరులోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలసి ఆయనకు చిరు జ్ఞాపికను అందించడంతో పాటు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఎంఎల్ఏకు శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందన్నారు. నియోజకవర్గంలో బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి పక్కా ప్రణాళికతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఆలయంలో దళారీ వ్యవస్థను అరికట్టడంతో ఆలయ హుండీ ఆదాయం పెరగడం శుభపరిణామం అన్నారు. సామాన్య భక్తులకు మెరుగైన సేవలు అందిస్తున్నారని చిట్టెమ్మ కొనియాడారు. ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్య శాశ్వతంగా పరిష్కరించడానికి భక్తకన్నప్పసేతు నుంచి టూరిస్టు బస్టాండు వరకు 40అడుగుల రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయం అన్నారు. ఇక తొట్టంబేడు మండలం పెద్దకన్నలిలో అగస్తీశ్వరాలయానికి మరమ్మత్తులు చేసి పూర్వ వైభవం తీసుకురావడానికి ఎంఎల్ఏ కృషిచేస్తున్నారన్నారు. అనంతరం దివంగత మంత్రి బొజ్జలగోపాలకృష్ణారెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పించారు.

# తిరుపతి డివిజన్

## మహా కుంభ మేళాలో అలరించిన

**శరత్ చంద్ర బృంద భరత నాట్య ప్రదర్శనలు**

తిరుపతి,జనవరి 16 ప్రభాతవార్త :



ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభ మేళాలో తిరుపతికి చెందిన గురు డాక్టర్ పరంకుశం శరత్ చంద్ర బృందం భరత నాట్య కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.బృందంలో శరత్ చంద్ర, శివప్రసాద్, ఉషాశ్రీ, వీణ శర్మ, హేమలత, పుష్పాంజలి, శ్రీ మన్నారాయణ, కుంచదలయతప్పి శివతాండవంలో శంభో, ఇంట్టి ముద్దులాడే బాలుడు, వినాయక కౌతం,దశావతార అష్టపతి, ముద్దుగారే యశోద,, హనుమాన్ చావీసా, నటన మనోహర వంటి కీర్తనలకు తమ హవా భావాలతో భరత నాట్య ప్రదర్శించి భక్తుల్లో భక్తి భావాన్ని పెంపొందించారు.ఈ మహాకుంభ మేళాలో భరత నాట్యం ప్రదర్శనలు చేయడం తమ పూర్వ జన్మ సుకృతంగా శరత్ చంద్ర, అతని బృందం చెప్పడం విశేషం.

## వైభవంగా కొండుచుట్టు ఉత్సవ వేడుకలు

నారాయణవనం, జనవరి 16 ప్రభాతవార్త :



సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చివరిరోజు నాల్గవరోజు గురువారం కొండచుట్టు(గిరిప్రదిక్షణ) ఉత్సవ వేడుకలను టిటిడి ఆద్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా నారాయణ వనంలో వెలసిన చంపకవల్లీ సమేత పరాశారేశ్వరస్వామి వారిని తెల్లవారుజామున 5గంటలకే వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అల ఒకరించి గ్రామపురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. అలాగే సముదాయం గ్రామంలో వెలసిన మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామివారిని కూడా అలంకరించిన తర్వాత సముదాయం గ్రామంలో ఉదయం 8.30గంటలకు సందింపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్ల సందింపును తిలకించడానికి వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. సుమారు అరగంటపాటు సందింపు జరిగిన తర్వాత కీళగరం, రెడ్డివీధుల్లో ఊరేగిన తర్వాత గోవిందప్పనాయుడుకండ్రిగ గ్రామంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం తుంబూరులో వెలసిన తుంబూరీశ్వరుడు, పాలమంగళంలో వెలసిన పాలీశ్వరస్వామి వారు తుంబూరులోని అరుణానదిలోకి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడకు చేరుకున్న నాలుగు గ్రామాలకు చెందిన దేవుళ్ల సందింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఈసంది ంపును తిలకించడానికి మండలనలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. అనంతరం పాలమంగళం, ఎలకటూరు మీదుగా నగరిలోని చింతలపట్టెడ సమీపంలోని మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లడం జరిగింది. ఎద్దులను పూలతో అలంకరించిన తర్వాత కొమ్ములకు బెల్యూన్ కట్టి తీర్చిదిద్దారు. సందింపు అనంతరం ఎద్దులను నదిలోకి వదిలేశారు. అలాగే అరణ్యంకండ్రిగ ంచాయతీ కైలాసకోనలో వెలసిన కామాక్షాంబింగా సమేత కైలాసనాధుని ౖ జడ్పీ ఫైనాన్ ౖ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయపర్యవేక్షకులు నాగరాజు, సివిల్ ఇంజనీరింగ్ ఎఇ గురుప్రసాద్, అర్చకులు రమేష్‌గురుకుల్, రమణిగురుకుల్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైకాపా విద్యార్థి విభాగం అధ్యక్షుడు హర్షిత్‌రెడ్డికి ఘన సన్మానం

తిరుపతిరూరల్, జనవరి 16 ప్రభాతవార్త:



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడుగా నియమితులైన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిని వైయస్సార్ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఓబుల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్య మంత్రి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఫీజు రియంబర్స్ మెంట్‌ను ప్రవేశపెట్టి పేద విద్యార్థుల జీవితాలలో వెలుగు నింపారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి, ప్రజల దగ్గరకే పాలనను కొనసాగించారన్నారు. విద్యార్థులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా విద్యార్థి నాయకులు కుప్పిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, ప్రదీప్, భూపాల్,కిరణ్, నవీన్‌కుమార్‌రెడ్డి, పార్థసారధి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ జిల్లా కమిటీలో కేవీబీ పురం మండలంలో నలుగురికి పదవులు...!

కేవీబీ పురం, జనవరి 16 ప్రభాతవార్త:

ఉమ్మడి చిత్తూరు తిరుపతి వైసీపీ జిల్లా కమిటీలో కేవీబీ పురం మండలంలో నలుగురు పార్టీ సీనియర్ నేతలకు కమిటీలో జిల్లా హోదా కల్పించారు. ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయం ప్రజలకు విడుదల చేసిన నేపథ్యంలో కేవీబీ పురం మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన పార్టీ మహిళ సీనియర్ నేత బొర్రా మాధవిరెడ్డికి ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలుగా రెండో సారి పార్టీ కేంద్ర కార్యాలయం హోదా కల్పించారు. అదే విధంగా ఆరె గ్రామానికి చెందిన ధరణి, ధనంజయలురెడ్డికి తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులుగా పార్టీ కేంద్ర కార్యాలయం హోదా కల్పించింది. ఎగువపూడి గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నేత శాస్త్రిరాజుకి రెండో సారి తిరుపతి జిల్లా సాంస్కృతిక విభాగ అధ్యక్షులుగా పార్టీ కేంద్ర కార్యాలయం హోదా కల్పించింది. ఎంప రాజుల కండ్రిగ గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నేత పాడి లాలుబాబు యాదవ్‌కు తిరుపతి జిల్లా క్రియాశీలక కార్యదర్శిగా పార్టీ కేంద్ర కార్యాలయం హోదా కల్పించింది. ఈ సందర్భంగా తిరుపతి జిల్లాలో కేవీబీ పురం మండలానికి సంబంధించి నలుగురికి హోదాలో రావడంతో పలువురు ఆ నేతలను అభినందిస్తున్నారు.

## వైసీపీ కుటుంబ సభ్యులకు, ప్రజలకు అండగా ఉంటా - రోజా

పుత్తూరురూరల్, జనవరి 16 ప్రభాతవార్త:



వైసీపీ కుటుంబ సభ్యులకు, ప్రజలకు అండగా ఉంటామని మాజీ మంత్రి రోజా తెలిపారు. మాజీమంత్రి రోజా ప్రాతినిధ్యం వహిస్తున్న నగరి నియోజకవర్గం నుంచి వైసీపీ రాష్ట్ర మున్సిపల్ కమిటీ సంయుక్త కార్యదర్శిగా గుణ శేఖర్ నియమితులైన సందర్భంగా నగరిలోని మాజీ మంత్రి రోజా కార్యాలయంలో గురువారం జరిగిన పుత్తూరు మున్సిపల్ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు ప్రజా క్షేత్రంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అండగా నిలవాలని తెలిపారు. పుత్తూరు మున్సిపాలిటీ వైసీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు రోజాని గజమాలతో, శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంజేరమ్మ కనుమలో భక్తుల రద్దీ

వడమాలపేట, జనవరి 16 ప్రభాతవార్త:



కనుమ పండుగ సందర్భంగా వడమాలపేట మండలంలోని అంజేరమ్మ కనుమలో భక్తులు అధిక సంఖ్యలో అంజేరమ్మ తల్లిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తలు గురువారం వేకువ జామున నుంచే విస్తృత ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిసర గ్రామాల ప్రజలే కాక దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి మొక్కులుతీర్చుకున్నారు.

## శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారిని దర్శించుకున్న చెవిరెడ్డి

చంద్రగిరి, జనవరి 16 ప్రభాతవార్త:



చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మవారి సంక్రాంతి మహోత్సవాలలో నిర్వహించే కొండచుట్టు ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అమ్మవారి అశ్వవాహన సేవలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపిపి మావిళిరెడ్డి గారి హేమేంద్రకుమార్ రెడ్డి సాదరంగా ఆహ్వానించి అమయ్మవారి దర్శన ఏర్పాట్లు గావించారు. ఇందులో భాగంగా ముందుగా ధర్మరాజుల స్వామి వారి ఆలయంలో ద్రౌపది ధర్మరాజ స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తదుపరి అశ్వవాహనంపై కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మాదవ రెడ్డి, కొత్తపాటి నాదముని రెడ్డి, బోడ్రెడ్డి విజయ్‌కుమార్ రెడ్డి, బండారు హేమచంద్రారెడ్డి, కొత్తపాటి కోటిరెడ్డి, రాజా రెడ్డి, ఆర్ఎస్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## టెన్నికాయిట్ క్రీడాకారిణిని సన్మానించిన ఎమ్మెల్యే



గూడూరు, జనవరి 16 ప్రభాతవార్త : ఈ నెల 11,12వ తేదీలలో పలాసలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ టెన్నికాయిట్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన ఉమ్మడి నెల్లూరు జిల్లా క్రీడాకారిణి నారిపాక మానసను గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సన్మానించారు. తన నివాసంలో గురువారం ఆమెను సత్కరించారు. గూడూరు నియోజకవర్గ పరిధిలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన క్రీడాకారిణి రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభను కనబరచడం అభినందనీయమన్నారు.

# గూడూరు డివిజన్

## పంపింగ్ సోర్స్‌ను పరిశీలించినజడ్పీ సిఈఓ



వాకాడు, జనవరి 16 ప్రభాతవార్త : వాకాడు స్వర్ణముఖి నది ఒడ్డున పంపింగ్ సోర్స్‌ను జడ్పి సిఈఓ విద్యారమ పరిశీలించారు. గురువారం చిట్టమూరు మండలం కోగిలి, 22 హాబిటేషన్స్ రక్షిత మంచి నీరు అందించే పంపింగ్ సోర్స్‌ను అధికారులతో చర్చించారు. ఆమె వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ నందకుమార్, చిట్టమూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్, చిట్టమూరు ఎంపిడిఓ, మనోహార్ గౌడ్, వాకాడు ఎంపిడిఓ పిఎం అన్నపూర్ణరావు ఉన్నారు.

## శ్రీమహాలక్ష్మమ్మ జాతరలో... భక్తజన పారవశ్యం



కోట, జనవరి 16 ప్రభాతవార్త : కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని కోటలో బుధవారం రాత్రి శ్రీమహాలక్ష్మమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి వాహనంపై ఉంచి గ్రామ పురవీధుల్లో జాతర కొనసాగించారు. కోటమ్మ గ్రామదేవతగా చెల్లెలుగా పిలువబడే శ్రీమహా లక్ష్మమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. పాడిపంటలు బాగా పండాలని, గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నారు. దాతల సహకారంతో అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి దర్శించుకున్నారు.

# అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు :నేదురుమల్లి



వెంకటగిరి, జనవరి 16 ప్రభాతవార్త : అధికారపార్టీ వారు పెట్టే అక్రమ కేసులకు భయపడే ప్రసక్తి లేదని, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్.జే.ఆర్ భవనంలో నియోజకవర్గ స్థాయి వైసిపిపార్టీ కార్యకర్తలు నాయకుల సమావేశం నిర్వహించారు. అధికారపార్టీ వారు పెట్టే అక్రమ కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటామని తెలిపారు. అక్రమ కేసులతో బెదిరించాలని అధికార పార్టీ వారు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అందరూ కలిసికట్టుగా, అధికార పార్టీ వారి అక్రమాలను దౌర్జన్యాలను ఎదుర్కోవాలని కార్యకర్తలకు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత అక్రమాలు అవినీతి పెరిగిందని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు అబద్దాల నేతని, 2027 సంవత్సరంలోనే ఎన్నికలు వస్తాయని అందరూ సిద్ధంగా ఉండాలని తెలిపారు. కొత్తగా నియమితులైన మండల పార్టీ అధ్యక్షులు మధు, రవి, శ్రీనివాసులురెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, చింతల శ్రీనివాసులురెడ్డిలను రాంకుమార్‌రెడ్డి సత్కరించారు. రాంకుమార్‌రెడ్డిని కొత్తగా నియమితులైన పార్టీ అధ్యక్షులు గజమాలతో సత్కరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ మధురెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు దశరధి రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏటి పండుగ లేనట్టేనా..?

సూళ్లూరుపేట, జనవరి 16 ప్రభాతవార్త : పట్టణంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న ఏటి పండుగను ఈ సారి నిర్వహించే సూచనలు కనిపించడం లేదు. గతంలో ఏటి పండుగ నిర్వహించేటప్పుడు చెంగాళమ్మగుడి సమీపంలోని కాళంగి నదిని శుభ్రం చేసి అక్కడ ఏటి పండుగ నిర్వహించేందుకు అనువుగా తీర్చిదిద్దేవారు. కొంతకాలం క్రితం చెంగాళమ్మ దేవస్థానం వారు అప్పటి పాలకమండలి ప్రత్యేక శ్రద్ధతో ఏటి పండుగను ఘనంగా నిర్వహించే ప్రక్రియ చేపట్టారు. అమ్మణ్ణి ఉత్సవ విగ్రహాలను కాళంగినది పరివాహక ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ ఘనంగా ఏటి పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. 2022 తర్వాత ఏటిపండుగను నిర్వహించడం లేదు, ప్రస్తుతం దేవస్థానం పాలక మండలి లేకపోవడంతో ఏటి పండుగ గురించి అసలు పట్టించుకోలేదు. గతంలో మున్సిపాలిటీ వారు ఏటి పండుగ నిర్వహించే ప్రక్రియలో భాగంగా కాళంగి నదిని శుభ్రం చేసి లైటింగ్ ఏర్పాటు చేసేవారు. కానీ ప్రస్తుతం ఇదేమీ పట్టించుకున్న దాఖలాలు లేనటువంటి, ఇందుకు తగ్గట్టుగా ప్రస్తుతం అధికారపార్టీ నేతలు దీనిపై దృష్టి సారించినట్లు కనిపించడం లేదు.దీంతో ప్రతి ఏటా సాంప్రదాయబద్ధంగా నిర్వహించే ఏటి పండుగ, గొబ్బెమ్మల నిమజ్జనాలకు మాత్రమే పరిమితమయ్యేలా కనిపిస్తోంది.

## సమన్వయంతో పనిచేద్దాం : డ్వామా పీడీ



సూళ్లూరుపేట, జనవరి 16 ప్రభాతవార్త : అందరం సమన్వయంతో పనిచేసి ఫ్లెమింగో ఫెస్టివల్‌ను విజయవంతం చేద్దామని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. గురువారం ఫ్లెమింగో ఫెస్టివల్ వేదిక అయిన జూనియర్ కాలేజి ప్రాంగణంలో వివిధశాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించి బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎగ్జిబిషన్ స్టాల్స్, వాటికి సంబంధించిన కేటాయింపులు, సాయంత్రం నిర్వహించే కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలకు తగిన ఏర్పాట్లను కేటాయించిన అధికారులు దగ్గరుండి చూసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ పండుగను నిర్వహిస్తు ందని, అందుకు తగ్గట్టుగా మనమందరం పనిచేయాలని కోరారు. శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని పోలీసుశాఖ వారు జనం రద్దీకి తగిన విధంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్డీఓ కిరణ్మయి మాట్లాడుతూ సూళ్లూరుపేట కేంద్రంగా నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌లో నేలపట్టు, బివిపాలెం, అటకానితిప్ప తదితర ప్రాంతాలు ప్రాథమిక భూమికను పోషించనున్నాయని తెలిపారు. అనంతరం ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు, వారికి కావలసిన వనరులు, ఇతర వ్యయం గురించి అడిగి తెలుసుకున్నారు. వెంటనే అందుకు సంబంధించిన సామగ్రిని అందజేయడం జరుగు తుందన్నారు. పాఠశాలలకు సెలవులు కావడంతో ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభరోజున విద్యార్థులను వేడుకలకు తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రవీంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు ప్రసంగిస్తూ పండుగ జరిగే మూడురోజుల పాటు కంపెనీల బస్సులు, ప్రైవేటు బస్సులు పట్టణంలోకి ట్రాఫిక్ రద్దీ దృష్టి దృష్ట్యా అనుమతించబోమని తెలిపారు. వీరందరు హోలీ క్రాస్ జంక్షన్, చెంగాళమ్మగుడి సమీపంలో కార్మికులను ఎక్కించుకోవాలని సూచించారు.

## మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వండి : ఎమ్మెల్యే బొజ్జల



శ్రీకాళహస్తి,జనవరి 16 ప్రభాతవార్త :శ్రీకాళహస్తి మున్సిపాలిటికి పన్నులు చెల్లించాల్సిన బడా బాబులు వెంటనే పన్నులు చెల్లించకుంటే ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించని వారిపై చట్టపరిధిలో చర్యలు తీసుకొనుటకు నిర్ణయం తీసుకున్నట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యా లయంలో అధికారులు సిబ్బందితో సమీక్షా సమావేశం జరిపిన ఆయన సమావేశం వివరాలను మీడియాకు తెలిపారు. కమిషనర్ బియస్ గిరికుమార్ సారథ్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు కీలక అంశాలకు సంబంధించి చర్చించినట్లు ఎంఎల్ఏ వివరించారు. ముఖ్యంగా మున్సిపల్ కార్యాల యానికి పక్కనే పాత మున్సిపల్ కమిషనర్ క్వార్టర్స్ నీటి సరఫరా ట్యాంకు ఉందన్నారు.అయితే అక్కడ పరిస్థితి పరిశీలిస్తే ఇంత అధ్వాన్నమా? అనిపిస్తుంద న్నారు. ఎందుకు అధికారులు ఇలా అధ్వాన్నంగా పెట్టుకున్నారో అర్థం కావటం లేదన్నారు. ఇక కార్యాలయంలో ఉన్న కంప్యూటర్స్ కాలం చెల్లినవి అన్నారు. కాబట్టి ప్రతి ఒక శాఖకు కొత్త వెర్షన్ కల్గిన కంప్యూటర్లను ఏర్పాటు చేసి సమాచారం అంతా అందులో పొందుపరచుటకు ఆదేశించినట్లు ఎంఎల్ఏ వివరించారు. ఇక గ్రేడ్‌వన్ మున్సి పాలిటిగా ఉంది కానీ ఏ శాఖ వద్దకు వెళ్ళినా కూర్చొటానికి కనీసం ఫర్నీచర్ లేదని గుర్తించామన్నారు. కావాల్సిన ఫర్నీచర్ కొనుగోలుకు కమిషనర్ కు సూచించా మన్నారు. ఇక శివరాత్రి లోపల పట్టణంలోని కేబుల్ ఆపరేటర్లు తమ వైర్లను విద్యుత్ స్థంభాల నుంచి తొలగించాలని వాటి కోసం ప్రత్యేకంగా పైపులు ఏర్పాటు చేస్తామని వాటిలో ఏర్పాటు చేసుకోవాల న్నారు. తీసుకోకుంటే కట్ చేస్తామన్నారు. పన్నులకు సంబంధించి నిరుపేదలకు మినహాయింపు ఉంటుందని ఎంఎల్ఏ వివరించారు.

## వైభవంగా కొండ చుట్టూ ఉత్సవం





పుత్తూరురూరల్, జనవరి 16 ప్రభాతవార్త: పుత్తూరు మున్సిపల్ పరిధిలోని కల్యాణపురం వద్ద కొండ చుట్టూ ఉత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల నుంచి పలు దేవతా మూర్తులను కొండ చుట్టూ మండపం వద్ద కొలువు తీర్చి విశేష పూజలు చేశారు. పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి, శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజస్వామి, భక్తాంజనే యస్వామి, పుత్తూరు మండలంలోని పలు గ్రామాల నుంచి దేవతామూర్తులను మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగిస్తూ కొండ చుట్టు మండపం వద్ద కొలువు తీర్చి విశేష పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులు మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## ప్రయాణీకులు మన కుటుంబ సభ్యులే!

**-ప్రమాద రహిత డ్రైవింగ్ దిశగా డ్రైవర్లు చూడాలి -డిపిటిఓ నరసింహులు,ఎంవిఐ శ్రీనివాస్**



తిరుపతి(రవాణ), జనవరి 16 ప్రభాతవార్త: ప్రయాణీకులు మన కుటుంబసభ్యులని, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత మనపై ఉందని తిరుపతి జిల్లా ఆర్టీసి డిపిటిఓ జి.నరసింహులు అన్నారు. ప్రమాద రహిత డ్రైవింగ్ దిశగా ప్రతి ఆర్టీసి బస్సు డ్రైవర్ తన విదులు జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఆర్టీసిలో ఉద్యోగులైన డ్రైవర్లు నిష్ణాతులేనని, అయితే బస్సులు నడిపే సమయంలో ప్రయాణీకులు మన కుటుంబసభ్యులేనని గుర్తుచేసుకుంటే ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు.డ్రైవర్లు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు. రోడ్డుభద్రత మాసోత్సవాలు సందర్భంగా గురువారం ఉదయం తిరుపతి డిపో, అలిపిరి డిపోలలో ఆర్టీసి డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. తిరుపతి డిపోలో జరిగిన సమావేశంలో ఎంవిఐ వి.శ్రీనివాస్, అలిపిరి డిపోలో తిరుమల ట్రాఫిక్ సిఐ పి.హరిప్రసాద్ ముఖ్యఅతిధులుగా పాల్గొని డ్రైవర్లు బస్సులను నడపడం, ప్రమాదాల నియంత్రణ, తగిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సమావేశంలో డిపిటిఓ జి.నరసింహులు, తిరుపతి డిపో మేనేజర్ టి.బాలాజీ, బస్‌స్టేషన్ మేనేజర్ డిఆర్ నాయుడు, సిబ్బంది, అలిపిరి డిపోలో అలిపిరి ఏవిఎస్ఓ రాజశేఖర్, విఐ పురుషోత్తం పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

## పకడ్బందీగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం : కలెక్టర్

చిత్తూరు, జనవరి 16 ప్రభాతవార్త: జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనం నుండి గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యశాఖ అధికారులు, మెడికల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షలో మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పిల్లలకు వేసే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంను పకడ్బందీగా నిర్వహించాలని, టీకాలు వేసుకోని పిల్లల జాబితాను డాక్టర్లు సిద్ధం చేయాలని, ఎఎన్ఎంలు నిర్వహించే రిజిస్టర్లను తనిఖీ చేసి ర్యాండమ్‌గా పిల్లల తల్లిదండ్రులతో వాక్సినేషన్ విషయంపై మాట్లాడి నిర్ధారించుకోవాలన్నారు. వాక్సినేషన్ వేయాల్సిన పిల్లలందరికీ తప్పనిసరిగా టీకాలు వేసేలా మెడికల్ ఆఫీసర్లు పర్యవేక్షించాలన్నారు.

# గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలి

**- బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు**



కోట, జనవరి 16 ప్రభాతవార్త : పూర్వ నెల్లూరు జిల్లా పరిధిలో ఉన్న గూడూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆ మేరకు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి లేఖ పంపడం జరిగిందని కోటేశ్వరరావు తెలిపారు.ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా పరిధిలో ఉన్న గూడూరు నియోజకవర్గాన్ని జిల్లాల పునర్విభజనకు ముందే నెల్లూరు జిల్లాలో ఉండేదని, గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సౌలభ్యాన్ని, అవసరాలను గుర్తించకుండా పార్లమెంటు ప్రాంతాల వారీగా జిల్లాను ఏర్పాటు చేయడం వలన గూడూరు అసెంబ్లీ నియోజకవర్గం తిరుపతి విలీనమయిందన్నారు. దీనివలన నియోజకవర్గ ప్రజలు పరిపాలన సౌలభ్యానికి దూరమయ్యారని తెలిపారు. ఐదు మండలాల ప్రజలు తిరుపతికి వెళ్లి రావడం కష్టతరంగా మారిందన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకు గురికావడం, ప్రతి ఒక్కరిపై ఆర్థికభారం పడుతుందని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గూడూరు పర్యటనకు వచ్చిన సందర్భంగా హామీ ఇచ్చారని, ఈ నియోజకవర్గం నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని కోరారు.

## రాంకుమార్‌రెడ్డికి అభినందనలు తెలిపిన నాయకులు



బాలాయపల్లి, జనవరి 16ప్రభాతవార్త:వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డికి, మాజీ ఏఎంసీ చైర్మన్ వెందోటి మధుసూదన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వేందోటి కళ్యాణ్ రెడ్డిలో అభినందనలు తెలిపారు. నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తనకు మండల పార్టీ అధ్యక్ష ప్రధాని రెండోసారి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. తనపై ఉన్న నమ్మకంతో పార్టీ పదవి ఇచ్చారని మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## హరికథ భాగవతులు విద్వాన్ వీర మల్లయ్య మృతి



వెంకటగిరి, జనవరి 16 ప్రభాతవార్త : ప్రఖ్యాత హరికథా భాగవతులు విద్వాన్ వి. వీర మల్లయ్య తిరుపతిలో పరమపదించారు. శుక్రవారం మధ్యాహ్నం ఎం.ఆర్.పల్లిరోడ్డు సమీపంలోని ఆయన స్వగృహం నుంచి అంతిమయాత్ర జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.విద్వాన్ వి.వీరమల్లయ్య ప్రఖ్యాత తెలుగు పండితులు. వెంకటగిరి రాజాస్ హైస్కూల్ విశ్రాంత తెలుగు పండితులుగా పనిచేశారు. గతంలో తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో విద్వాన్ వీర మల్లయ్య సన్మానం అందుకున్నారు. వీర మల్లయ్య మృతి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిబి సాయి కృష్ణయ్య చంద్ర, ఆర్వీఎం పాఠశాల సిబ్బంది సంతాపం తెలిపారు.

## శాశ్వత సభ్యత్వం తీసుకున్న వెంకటకృష్ణారెడ్డి



బాలాయపల్లి, జనవరి 16 ప్రభాతవార్త : మండల రైతు విభాగం అధ్యక్షులు ఆదిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును స్వీకరించారు. ఎమ్మెల్యే కురుగొండ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆయన సభ్యత్వ నమోదును తీసుకున్నారు. తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రజాసేవకే జీవితం అంకితం : లక్కమనేని



వెంకటగిరి, జనవరి 16. ప్రభాతవార్త : ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేస్తానని వెంకటగిరి టౌన్ క్లబ్ అధ్యక్షులు లక్కమనేని కోటేశ్వరరావు అన్నారు. క్లబ్ అధ్యక్షుడు కోటేశ్వరరావు జన్మదిన సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేస్తానని, డాక్టర్ అయిన తన కుమా రుడు సాయి తేజ ద్వారా కూడా ప్రజలకు వైద్య సేవలు అందిస్తానని చెప్పారు. మాజీ పద్మశాలి కార్పోరేషన్ డైరెక్టర్ నక్కవెంకటేశ్వర్ రావు, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, పొనుగోడు సుబ్రహ్మణ్యం, గంగినేని వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు రవి మాదిగలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పార్టీలో పెద్ద దిక్కుని కోల్పోయాం : ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, పాశం



చిల్లకూరు, జనవరి 16 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీలో పెద్ద దిక్కుని కోల్పోయామని ఈ విషయం బాధాకరమన్నారు. గురువారం మండలంలోని రామారెడ్డిపాలెం గ్రామంలో సన్నారెడ్డి వెంకట రమణారెడ్డి ఉత్తర క్రియల్లో భాగంగా సంస్కరణ సభలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పాశం కుమార్ నాయకులతో కలిసి పాల్గొని వెంకటరమణారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించిన అప్పటి నుంచి పార్టీ కోసం చేసిన సేవలు ఎనలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నల్లారెడ్డి, రమేష్ బాబురెడ్డి, పచ్చ వెంకటేశ్వర్లు నాయుడు, గుండాల లీలావతి, పాదార్తి రాధాకృష్ణారెడ్డి, పూడిపర్తి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మునిభాస్కర్‌రెడ్డి, ఎస్.వి.ఆర్ అభిమానులు, కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేమన పద్యాలలోని జ్ఞానం,ఆవశ్యకత ప్రచారం



గూడూరు, జనవరి 16 ప్రభాతవార్త : త్రైత సిద్ధాంత ఆదికర్త, ఇందూ జ్ఞాన ప్రదాత శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారు రచించిన నిగూఢ తత్వార్థ బోధిని అనే గ్రంథంలో 110 వేమన పద్యాలుకు ఆధ్యాత్మిక వివరంగా వ్రాశారని జ్ఞాన వేదిక వి.కోట కమిటీ తెలిపింది. కనుక నేటితరంనకు వేమన పద్యాల, జ్ఞాన ఆవశ్యకత ఎంతైనా ఉంది అని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక వి.కోట కమిటీ దుత్తలూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గూడూరు మండలంలోని చెన్నూరు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథముల ప్రచారం జరిగింది. వేమన పద్యం వేయి విధములు అర్థాలు అమరి ఉండవచ్చు కానీ శోధించి చూస్తే అంతా ఆత్మ జ్ఞానమే ఉంటుంది అని శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ద్వారా తెలిసింది. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక వి.కోట కమిటీ, దుత్తలూరు కమిటీల అధ్యక్షులు, సభ్యులు కె.అశోక్ బాబు, జి.ప్రసాద్, చరణ్, ఝాన్సీ,శేఖర్‌రెడ్డి,మధుసూదన్‌రావు, వెంకట సుబ్బయ్యలు పాల్గొన్నారు.

## వైభవంగా సంక్రాంతి సంబరాలు



గూడూరు, జనవరి 16 ప్రభాతవార్త : పట్టణంలోని జక్కా వెంకయ్య శ్రామిక నగర్‌లో సిపిఎంపార్టీశాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గురువారం కామ్రేడ్ సీతారాం ఏచూరి స్మారక ముగ్గుల పోటీలు సంక్రాంతి సంబరాలలో భాగంగా ఘనంగా నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీ పర్యవేక్షణ సి.హెచ్. సుధారాణి, జి.వినీల నిర్వహణలో చిన్నారు లు, మహిళలు 15మంది పోటీలలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిలుగా గూడూరు తహశీల్దార్ సి.చంద్రశేఖర్, డాక్టర్ ఎం.ప్రవీణ్ విచ్చేసి ముగ్గులు పోటీలలో విజేతలుగా గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా పి.మహాలక్ష్మి, రెండో బహుమతి జి.సుప్రజ, మూడో బహుమతి ఎం.కావేరి గెలుచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు టి.వెంకటరామిరెడ్డి, భవన నిర్మాణ సంఘం సీనియర్ నాయకులు పుట్టా శంకరయ్య, పామంజి మణి, బి.వి.రమణయ్య, ఎస్.సురేష్, అడపాల ప్రసాద్, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఉదయ భాస్కర్, వెంకటేశ్వర్లు బల్లి గోవర్ధన, మదన్, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## గమ్మత్తుగా తాగేశారు

కోట, జనవరి 16 ప్రభాతవార్త : సంక్రాంతి పండుగ సందర్భంగా మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. గత వైసీపీ పాలనలో నాసిరకం మద్యం మాత్రమే అందుబాటులో ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేవారు.. తమ వెంట అక్కడి సరుకు తెచ్చుకునేవారు. ప్రస్తుతం నాణ్యమైన బ్రాండ్లు అందు బాటులో ఉండటంతో పందేలకు ఇతర ప్రాంతాలకు వచ్చిన వారు స్థానికులతో దుకాణాలు క్రిక్కిరిశాయి. కోడిపందేలు ఆడే ప్రాంతాల్లో విక్రయాలు బాగా ఊపందుకున్నాయి. ఫలితంగా ఎక్సైజ్‌శాఖకు ఆదాయం భారీగా సమకూరింది.

## అభివృద్ధి సంక్షేమం చంద్రబాబు లక్ష్యం : రవాణాశాఖ మంత్రి

నాయుడుపేట జనవరి 16 ప్రభాతవార _; రాష్ట్రంలో ప్రజల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం నివాసంలో మంత్రికి తెదేపా నాయకులు గురువారం ఘనస్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఘనంగా సన్మానించారు. ఈస ందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల అభివృద్ధి కూటమి ప్రభుత్వంకే సాధ్యమౌతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిఒక్క హామీ తప్పకుండా కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. అంతేకాకుండ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో స్పోర్ట్స్ అకాడమి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట నియోజకవర్గఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం, మాజీ మంత్రి పరసారత్నం, ఏఎమ్‌సి మాజీ చేర్మేన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, నెలవల రాజేష్, 786రఫి, జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్,నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

## ఎద్దుల బండి పోటీల్లో అపశృతి!

నాయుడుపేట, జనవరి 16 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని ఏఎల్‌సిఎమ్ గ్రౌండులో పండుగ పర్వదినం సందర్భంగా గురువారం నిర్వహించిన ఎద్దుల బండి పోటీల్లో అపశృతి చోటుచేసుకొంది. ఈఎద్దుల బండి పోటీలను వీక్షించేందుకు వచ్చిన ప్రజలు, వాహనాలపైకి ఎద్దుల బండ్లు దూసుకెళ్ళడంతో మేనకూరుకు చెందిన పరంశెట్టి పోలయ్య మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి గాయపడిన వారిని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వారిలో పోలయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు అపోలో వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకొని గాయపడిన వారిని పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

## బెల్టు షాపులపై దాడులు -పది మద్యం బాటిళ్లు స్వాధీనం



వాకాడు, జనవరి 16 ప్రభాతవార్త : బెల్టు షాపులపై దాడులు నిర్వహించి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఓ మహిళను అరెస్టు చేసినట్లు వాకాడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్‌ఫెక్టర్ ఆర్‌వివిఎస్ ప్రసాద్ తెలిపారు. గురువారం వాకాడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్‌ఫెక్టర్, వారి సిబ్బంది, గూడూరు ఈఎస్‌టిఎఫ్ టీంతో కలిసి ఎక్సైజ్ నేరములు బెల్టు షాపులపై దాడులు నిర్వహించి కోట మండలం ఊనుగుంట పాలెం గ్రామం మట్టిగుంట వెంకట సుబ్బయ్య భార్య భగవతి వద్ద అక్రమ మద్యం బాటిల్స్ ఉన్నందున ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాధిత కుటుంబానికి 8.80లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



కుప్పం, జనవరి 16 ప్రభాతవార్త : కుప్పం మున్సిపల్ పరిధి జెపి రోడ్‌లో ఉంటున్న రాజమ్మ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన 8.80లక్షల చెక్కును గురువారం మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, పార్టీ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, కొత్తపేట యూనిట్ ఇన్‌చార్జ అప్పు, నేతలు మహేంద్ర, సుకుమార్ అందించారు. తన కుమారుడి అనారోగ్యం కారణంగా వైద్య ఖర్చుల నిమిత్తం రాజమ్మ అప్పులు తీసుకోవడంతో కుటుంబ పరిస్థితి బాగా లేదని సిఎం చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందించింది. దీనిపై సిఎం చంద్రబాబు స్పందించి 8.80లక్షలు మంజూరు చేశారు. సిఎం చంద్రబాబునాయుడు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నంలకు రాజమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

# కన్నుల పండుగగా అయ్యప్ప మకర జ్యోతి దర్శనం



సదుం, జనవరి 16 ప్రభాతవార్త : మండలంలోని ఎర్రాతివారిపల్లెలోని బురుజు కొండపై వెలసియున్న శ్రీ అయ్యప్పస్వామి వారి ఆలయంలో అయ్యప్ప మకరజ్యోతి దర్శనం కన్నుల పండువగ జరిగింది. అయ్యప్ప ఆలయ ధర్మకర్త పుంగనూరు శాసనసభ్యులు మాజీ మంత్రి పెద్దిపెద్ది రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తదితరులు స్వామివారికి ఇరుముడులు చెల్లించారు. వీరితో పాటు వందలాది మంది అయ్యప్ప భక్తులు ఇరుముడులు కట్టుకొని రాత్రి వరకు అయ్యప్పస్వామి దర్శించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి వారి ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ మరకజ్యోతి దర్శనం కార్యక్రమానికి జిల్లా నుంచి వేలాది మంది భక్తుల తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ ఎన్ రెడ్డిప్ప, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పుంగనూరు మాజీ మున్సిపల్ చైర్మన్ కొండవీటి నాగభూషణం, వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డి కృష్ణమూర్తి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, జడిపటిసీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ధనుంజయరెడ్డి, వ్యవసాయ జిల్లా సలహా మండలి మాజీ సభ్యులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు సీఎం తిమ్మారెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, పులిచెర్ల మండల అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఎర్రావారిపాలెం జడ్పీటీసి కరుణాకర్‌రెడ్డి, చౌడేపల్లె మాజీ ఎంపీపీ అంజిబాబు, చౌడేపల్లి ప్రభుత్వ వైద్యశాల మాజీ అధ్యక్షుడు కళ్యాణ్ భరత్, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.